RNI NO :Title-Code :-TELTEL02102

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దినపత్రిక

అనుక్షణం ప్రజలపక్షం...

సంపుటి - 1 సంచిక - 186 శుక్రవారం 12 జూలై 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


yuvataku జాబ్స్ రాకుండా

యువతకు జాబ్స్ రాకుండా కేటీఆర్, హరీశ్‌రావు కుట్ర

మంత్రి పొన్నం 2లో.





WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా, మండల, కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను.

ఎడిటర్ : బిర్రు కరుణాకర్

Cell: 9701249103




3లో.

# రెక్కాడితే గాని డొక్కాడని జీవితాలు

- నివసించడానికి సరైన ఇళ్లు ఉండదు
- తినడానికి మూడు పూటలా తిండి ఉండదు
- కష్టం వస్తే ఒక్క రూపాయి అప్పు పుట్టదు
- కూలీలకు ఎలాంటి పథకాలు ప్రవేశపెట్టరు
- బ్రతికినంత కాలం కష్టనష్టాలతో బ్రతకాల్సిందే
- ప్రభుత్వం వ్యవసాయ కూలీలపై దృష్టి పెట్టాలి

# భద్రకాళి ఆలయంలో ఆరవ రోజుకు చేరుకున్న వేడుకలు

**వరంగల్, జూలై 11,(జర్నలిస్ట్ వార్త):** కాకతీయుల రాజధానని ఏకశిలానగరంగా చరిత్ర ప్రసద్ధిగాంచిన వరంగల్ మహానగరంలో పరమపావనమైన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ భద్రకాళీ దేవస్థానంలో శాకంభరీ నవరాత్ర మహోత్సవములు గురువారం నాటికి ఆరవ రోజుకు చేరుకున్నాయి. భద్రకాళి ఆలయ కార్యనిర్వహణాధికారి, సహాయ కమీషనర్, కే. శేషుభారతి తెలిపిన వివరాల ఈ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నిత్యాహ్నికం పూర్తి చేసిన పిమ్మట అమ్మవారి ఉత్సవ మూర్తులలో ఇచ్చాశక్తిని కాళీ క్రమాన్ని అనుసరించి విరోధిని మాతగాను, షోడశీ క్రమాన్ని అనుసరించి వహ్నివాసిని గాను అలంకరించి పూజారాధనలు నిర్వహించారు. విరోధిని నిత్య అమ్మవారు భక్తులకు శత్రు విజయము కలలిగించును. వహ్నివాసిని కర్మఫలప్రాప్తి కలిగించుటయేగాక ఐశ్వర్యాభివృద్ధి కల్గించునని ఆలయ ప్రధానార్చకులు శ్రీ



భద్రకాళి శేషు తెలిపారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు మంచినీటి వసతి, ప్రసాద వితరణ తదితర ఏర్పాట్లుపై ఆలయ ఈ.ఓ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఈ మహా నగరానికి ఏమైంది?





**కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ ఫైర్**

- ఇకనైనా కాంగ్రెస్ సర్కారు మేల్కొనాలి
- హైదరాబాద్ కేవలం రాజధాని కాదు..
- తెలంగాణ ఎకనామిక్ ఇంజిన్
- ట్విట్టర్ వేదికగా ప్రభుత్వ వైఫల్యాలను
- ఎండగట్టిన కేటీఆర్

2లో.

# అభిప్రాయాలు తెలుసుకోవడానికే రైతు భరోసాపై సదస్సులు



**ఉట్నూరు రైతు భరోసా వర్క్ షాప్‌లో ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క**

- రైతు భరోసా పథకం విధివిధానాలపై
- అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు వెల్లడి
- అన్నదాతల అభిప్రాయాల మేరకే
- ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్న భట్టివిక్రమార్క

2లో.



# గత పాలకులు వీరప్పన్ వారసులు

: బండి సంజయ్

నామాలు పెట్టుకుని.. వేంకటేశ్వరస్వామికి, టీటీడీకి, పంగనామాలు పెట్టారు

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న బండి సంజయ్

2లో.

# జర్నలిస్ట్ వార్త కథనానికి స్పందన

- ప్రమాదకర గుంతను పూడ్చిన మున్సిపాలిటీ
- హర్షం వ్యక్తం చేస్తున్న వాహనదారులు



NEWS EFFECT


మున్సిపాలిటీ ముందే ముప్పు..

తప్పించరూ...!

- రోడ్డును పగల గొట్టగా ఏర్పడిన గుంత
- తారు, మొరం పోయగా ఫలితం లేదు
- గుంత లోతుగా మారడంతో వాహన దారులకు తప్పని తిప్పలు

నర్సంపేట, జులై 10,(జర్నలిస్టు వార్త): నర్సంపేట పట్టణ కేంద్రంలో ఓ గుంత ప్రయాణికులకు, వాహనదారులను ప్రమాదంగా మారింది. నిరంతరం వాహన దారులకు తప్పని తిప్పలుగా మారింది. పైప్ లైన్ కోసం తీసిన ఆ గుంత మూలంగా ప్రధాన రహదారిపై ప్రయాణించే వాహనదారులు పడుతూ లేస్తున్నారు. తాత్కాలిక ఉపశమనం కోసం మొరం పోసిన వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో ప్రధాన రహదారి కావడం వల్ల ఫలితం లేక పోయింది. స్వయంగా ఆ గుంత మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉండటం విశేషం. వాహనదారులు ఇబ్బందులు పడడం గ్రహించిన స్థానికులు అధికారులు పట్టించుకోకపోవడం వల్లే వాహనదారులు, ప్రయాణికులు ఇలాంటి పరిస్థితులు ఎదుర్కొంటున్నారని ఆరోపిస్తున్నారు. ఆ గుంత మూలంగా వాహన దారులకు తృటిలో ప్రమాదం తప్పిందని చెప్పవచ్చు. బుధవారం సెంట్రింగ్ కర్రల లోడ్ తో వెళుతున్న ఓ ఆటో గుంతలో దిగబడింది. ఎంత ప్రయత్నించినా బయట పడకపోవడంతో హమాలీలు వచ్చి ఆటోను నెట్టి బయటకు తీశారు. ఇలా చేస్తున్న క్రమంలో ట్రాఫిక్ జామ్ కావడంతో పాటు వాహన దారులు ఇబ్బందులు పడ్డారు. మున్సిపాలిటీ అధికారులు, సంబంధిత అధికారులతో కలిసి గుంతకు శాశ్వత మరమత్తు పనులు చేపట్టి, వాహనదారులకు ఉపశమనం కలిపించాలని, ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

ప్రచురించిన ప్రత్యేక కథనం

**నర్సంపేట, జూలై 11,(జర్నలిస్ట్ వార్త):** నర్సంపేట పట్టణ కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయం ముందే ప్రమాదకరమైన గుంతలు ఏర్పడ్డాయి. పట్టణ కేంద్రంలో ఏర్పడిన ఆ గుంత కారణంగా అనేకమంది వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. బాధితుల ఆవేదన మేరకు జర్నలిస్ట్ వార్త దినపత్రికలో ఆ ప్రమాదకర పరిస్థితులను వివరిస్తూ, వాహనదారులను పరిరక్షించాలని కథనాన్ని ప్రచురించడం జరిగింది. గురువారం ప్రచురించిన ప్రత్యేక కథనానికి మున్సిపాలిటీ వారు స్పందించి, రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టణ కేంద్రంలో మున్సిపాలిటీ సిబ్బంది తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టి గుంతలో కంకర చిప్స్ పోసి గుంతలను పూడ్చేశారు. జర్నలిస్ట్ వార్త కథనానికి స్పందించి మున్సిపాలిటీ సిబ్బంది వేగవంతంగా తాత్కాలిక మరమత్తు పనులు చేపట్టడంతో గమనించిన వాహనదారులు, ప్రయాణికులు, స్థానికులు ప్రజలకు అవసరమైన వార్త కథనాల్ని ప్రచురితం చేస్తూ, అధికార యంత్రాంగాన్ని కదిలిస్తూ, ప్రజా పరిరక్షణ కోసం అనునిత్యం ప్రయత్నం చేస్తున్న జర్నలిస్ట్ వార్త దినపత్రికకు అభినందనలు తెలుపుతూ, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా పరిరక్షణ కోసం ఇలా పని చేసే నిజాయితీగల జర్నలిజాన్ని మాత్రమే ప్రజలు కోరుకుంటారని ప్రశంసిస్తున్నారు.



# 24 నుంచి అసెంబ్లీ సమావేశాలు

- సమీక్ష నిర్వహించిన అసెంబ్లీ స్పీకర్, మండలి ఛైర్మన్
- 24 నుంచి బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయం

హైదరాబాద్,జులై 11,(జర్నలిస్ట్ వార్త): తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈనెల 24 నుంచి జరగనున్నాయి. ఈమేరకు ప్రభుత్వం నిర్ణయించింది. సమావేశాల నిర్వహణకు సంబంధించి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఈరోజు అసెంబ్లీలో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రభుత్వ విప్ లు ఆది శ్రీనివాస్, రామచంద్ర నాయక్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ జితేందర్ తో పాటు పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# అభిప్రాయాలు తెలుసుకోవడానికే రైతు భరోసాపై సదస్సులు

ఆదిలాబాద్ జులై 11,(జర్నలిస్ట్ వార్త):
: క్షేత్రస్థాయిలో రైతుల నుండి అభిప్రాయాలు సేకరించి పూర్తిస్థాయి మార్గదర్శకాలతో 'రైతుభరోసా' పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఏజెన్సీ కేంద్రంలోని కేబీ కాంప్లెక్స్ సమావేశ మందిరంలో రైతు భరోసా విధివిధానాల ఖరారుపై ఉమ్మడి అదిలాబాద్ జిల్లా రైతుల నుండి అభిప్రాయాలు, సలహాలను క్యాబినెట్ సబ్ కమిటీ సేకరించింది. క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క తో పాటు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రి దినసరి సీతక్క శాసనసభ్యులు ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాల్లో కీలకమైన రైతు భరోసా పథకాన్ని ప్రజాక్షేత్రంలో రైతుల అభిప్రాయాలకు అనుగుణంగా పకడ్బందీగా అమలు చేసి తీరుతుంది అన్నారు. అన్ని జిల్లాల్లో క్యాబినెట్ సబ్ కమిటీ పర్యటించి ప్రజా క్షేత్రం లో అభిప్రాయాలు సేకరించి ఈ అసెంబ్లీలో నివేదిక పొందుపరుస్తామని అన్నారు. పంట పెట్టుబడి సాయం కోసం అందించే రైతు భరోసా పేద బడుగు వర్గాలకు న్యాయం చేసేదిగా ఉండాలని విజ్ఞప్తులు వస్తున్నాయని అన్నారు. రైతు భరోసా సాయం పై ఇప్పటివరకు ఎలాంటి పరిమితులు ఖరారు కాలేదని, గ్రామం యూనిట్గా తీసుకోవాలని రైతులు ఎక్కువమంది సూచిస్తున్నారని పేర్కొన్నారు. పోడు



రైతులకు సర్కారు సాయంపై చర్చించి నిర్ణ నిర్ణయం తీసుకుంటామని అన్నారు.

### బడా రైతులకు వద్దు..
### 10 ఎకరాల పరిమితి విధించండి..

ప్రభుత్వం అందించే పంట పెట్టుబడి సాయం రాష్ట్ర ఆర్థిక భారం దృష్ట్యా పెద్ద రైతులకు పక్కనపెట్టి పేద, దళిత గిరిజన రైతులకు అందించాలని పలువురు రైతులు కోరారు. మెస్రం జంగు అనే గిరిజన రైతు మాట్లాడుతూ వర్షాధారంపైనే తాము పంట సాగు చేస్తున్నామని, ఖర్చులు పోను ఏమీ మిగడం లేదన్నారు. కౌలు రైతులకు కూడా సగం వంతు, మిగిలిన సగం ఆర్థిక సాయం పట్టా రైతులకు అందించాలని అన్నారు. వెనుకబడిన అదిలాబాద్ ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో పది ఎకరాల సాగు చేసే రైతులందరికీ తప్పకుండా రైతు భరోసా వర్తింపజేయాలని కోరారు. ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు సర్కారు పంటల సాయం నిలుపుదల చేయాలని, రియల్ ఎస్టేట్ భూములు, సాగుకు పనికిరాని బీడు భూములకు కూడా పంటల పెట్టుబడి సాయాన్ని ఆపివేయాలని ప్రకాష్, గుణవంతు, అనే రైతులు కోరారు .

### ఫసల్ బీమా యోజన ప్రీమియం చెల్లించండి.. ఎమ్మెల్యే పాయల్ శంకర్

రైతులకు విపత్తు సమయం లో పరిహారం అందించే ఫసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని, రైతుల ప్రీమియం డబ్బులు ప్రభుత్వమే చెల్లించాలని కోరారు. బడా పారిశ్రామికవేత్తలకు, మూడు పంటలు సాగు చేసే పెద్ద రైతులకు పంట పెట్టుబడి సాయం అందించకుండా, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని పది ఎకరాలు సాగు చేసే రైతులందరికీ రైతు భరోసా అమలు చేయాలని కోరారు.

### బడ్జెట్లో 20% నిధులు ఆదిలాబాద్ కు కేటాయించాలి.. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు

వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాలో 80 శాతం రైతులు వర్షాధారంపైనే పంటలు సాగు చేసి నష్టపోతున్నారని, ఈ జిల్లాకు ప్రభుత్వం స్పెషల్ ప్యాకేజీ అమలు చేయాలని అన్నారు. బడ్జెట్లో ఎక్కువ మొత్తం నిధులు ఖమ్మం జిల్లాకు వెళ్తున్నాయని చలోక్తిగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రావడానికి ముందు వరసలో ఉన్న ఆదిలాబాద్ జిల్లాకు ప్రత్యేకంగా బడ్జెట్లో 20% నిధులు కేటాయించి ఆదుకోవాలని కోరారు.
అనంతరం ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మాట్లాడుతూ ఈ పథకం అమలులో రైతులు, ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించేందుకే ఉమ్మడి జిల్లాల సూచనలు స్వీకరిస్తున్నట్లు చెప్పారు చెప్పారు.ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి మాట్లాడుతూ.. అన్ని వర్గాల రైతులను ఆదుకున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు బంధు పథకంతో చేరువయ్యారని, ఈ పథకంలో ఆంక్షలు విధించవద్దని కోరారు.రైతులు,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార మాట్లాడుతూ.. రైతులకు పంటల పెట్టుబడి సాయం కింద రైతుభరోసా ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చామన్నారు. ఆ హామీ అమలుకు తమ ప్రభుత్వం దృఢసంకల్పంతో ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశ పెట్టిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చే నిధులను దృష్టిలో పెట్టుకొని త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడుతుందని తెలిపారు. అలాగే రాష్ట్ర పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలోనే రైతుభరోసా అమలుపై విధివిధానాల రూపకల్పన చేస్తామన్నారు. ఇందుకోసమే తమ ప్రభుత్వం క్యాబినెట్ సబ్ కమిటీని నియమించినట్లు చెప్పారు. ఉమ్మడి జిల్లాల్లో పర్యటించి.. ప్రజలు, రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించి విధివిధానాలు రూపొందించాలని నిర్ణయించినట్లు తెలిపారు.
క్యాబినెట్ సభ కమిటీ సభ్యుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. నిజమైన రైతులకే రైతుభరోసా అందించేందుకు అన్ని వర్గాల ప్రజల నుంచి అభిప్రాయాలు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. అన్ని వర్గాల ఆలోచనల మేరకు అర్హులైన చిన్న, సన్నకారు రైతులకు రైతుభరోసా అందిస్తామన్నారు.క్యాబినెట్ సబ్ కమిటీ మరో సభ్యుడు, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. నిజమైన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని తెలిపారు. మరో 8 ఉమ్మడి జిల్లాల్లోనూ ప్రజల అభిప్రాయాలు సేకరిస్తామన్నారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఎంపీ గొడెం నగేష్ శాసనసభ్యులు అనిల్ జాదవ్, రామారావ్ పటేల్, హరీష్ రావు,వెడ్మ బొజ్జు , పెద్దపల్లి ఎంపీ వంశీ,జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.

# ఈ మహా నగరానికి ఏమైంది?

## కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ ఫైర్

హైదరాబాద్,జులై 11,(జర్నలిస్ట్ వార్త):
ఈ మహానగరానికి ఏమైంది అంటూ బీఆర్ఎస్?వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్విట్టర్ వేదికగా ప్రశ్నించారు. గురువారం పలు అంశాలపై ఆయన ప్రభుత్వ విధానాలను ఎండగట్టారు. అంతేకాకుండా.. "బ్రాండ్ హైదరాబాద్" ఎందుకు మసకబారుతోంది.. విశ్వనగరంగా ఎదుగుతున్న వేళ.. ఎందుకింత కళ కోల్పోతోంది.. అని సగటు హైదరాబాదీకి అనిపిస్తుందని కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ను ప్రేమించే ప్రతిఒక్కరిలో ఇదే ఆవేదన ఉందన్నారు. పదేళ్లు ప్రశాంతంగా ఉన్న హైదరాబాద్ సిటీలో వరుస హత్యలు.. పేట్రేగిపోతున్న అంతరాష్ట్ర ముఠాల తీరు కనిపిస్తోందన్నారు.
రాజధాని హైదరాబాద్లో శాంతి లేదని.. నగర ప్రజల జీవితాలకు భద్రత లేదని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం గారు స్వయంగా.. పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్కు వస్తున్నా.. పోలీసింగ్పై కమాండ్ ఏది అని ప్రశ్నించారు. క్షీణిస్తున్న శాంతిభద్రతలపై కంట్రోల్ ఏది అని నిలదీశారు. ఓవైపు.. కుప్పకూలిన రియల్ ఎస్టేట్ రంగం.. పరిపాలనా వైఫల్యాన్ని వేలెత్తి చూపుతోందన్నారు. మరోవైపు పడగవిప్పిన హత్యల సంస్కృతి.. ప్రతి కుటుంబంలో వణుకు పుట్టిస్తోందన్నారు. ఇంకోవైపు.. తరలిపోతున్న పెట్టుబడుల పర్వం.. యువత ఉపాధి అవకాశాల్ని దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

### గడియ గడియకు పవర్ కట్ ఏమిటీ?

కాంగ్రెస్ పవర్లోకి రాగానే గడియ గడియకు పవర్ కట్ ఏమిటీ? అని కేటీఆర్ ప్రశ్నించారు. సేఫ్ సిటీగా ఉన్న మహానగరంలో క్రైమ్ రేట్ ఎందుకు పెరిగిపోతోందన్నారు. ఇదేనా మీరు తెస్తానన్న మార్పు అని మండిపడ్డారు. విశ్వనగరంగా తీర్చిదిద్దడానికి.. పదేళ్లు కష్టపడి పునాదులు వేస్తే.. అధికారంలోకి రాగానే ఆగం చేస్తే ఎలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రపంచంతో పోటీపడే నగరంగా ఎదుగుతున్న హైదరాబాద్ ప్రగతికి అర్ధాంతరంగా బ్రేకులు వేస్తే ఎలా?.. దేశ రాజధాని చుట్టూ రాజకీయ చక్కర్లు కొట్టడంపై ఉన్న శ్రద్ధ.. చిక్కుల్లో కొట్టుమిట్టాడుతున్న రాష్ట్ర రాజధానిపై లేకపోతే ఎలా అని మండిపడ్డారు. హైదరాబాద్ అంటే.. కేవలం రాజధాని కాదు. "తెలంగాణ ఎకనమిక్ ఇంజన్" అని కేటీఆర్ స్పష్టం చేశారు. ఇకనైనా.. కాంగ్రెస్ సర్కారు మేల్కొనకపోతే మన హైదరాబాద్ దెబ్బతింటే.. రాష్ట్రానికి కష్టమే కాదు.. యావత్ దేశానికి కూడా నష్టమన్నారు.

### సిరిసిల్లకు మెగా పవర్ లూమ్ క్లస్టర్ తీసుకురండి
#### బండి సంజజ్కు బహిరంగ లేఖ

ఈసారి కేంద్ర బడ్జెట్లో సిరిసిల్లకు మెగా పవర్ లూమ్ క్లస్టర్ను తీసుకురావాలని కోరుతూ కేంద్రమంత్రి బండి సంజజ్కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోరారు. ఈ మేరకు ఆయన కేంద్ర మంత్రికి బహిరంగ లేఖ రాశారు. పదేళ్లుగా ప్రతి బడ్జెట్లో కేంద్రం తెలంగాణకు మొండిచెయ్యి చూపిందని గుర్తు చేశారు. అనేకసార్లు పవర్లూమ్ క్లస్టర్ కోసం పది సార్లు కేంద్రానికి లేఖలు, స్వయంగా కలిసి కేంద్ర మంత్రులకు విజ్ఞప్తి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సారైనా సిరిసిల్లకు మెగా పవర్ లూమ్ క్లస్టర్ను తెప్పించండని అభ్యర్థించారు. . కేంద్ర మంత్రిగా మీకు వచ్చిన అవకాశాన్ని వినియోగించుకోవలసిందిగా సూచించారు. . ఈసారి కేంద్ర బడ్జెట్లో సిరిసిల్లకు శుభవార్త అందేలా చూడాలని బండి సంజయ్ను కేటీఆర్ కోరారు.

# ఫ్రెండ్లీ కండక్టర్ అనూపరాణికి సజ్జనార్ అభినందన

హైదరాబాద్,జులై 11,(జర్నలిస్ట్ వార్త):



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) కు కండక్టర్లు, డ్రైవర్లే బ్రాండ్ అంబాసిడర్లని ఆ సంస్థ ఎండీ సజ్జనార్ పేర్కొన్నారు. నిబద్ధతతో, అంకితభావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది కారణంగానే ఆర్టీసీ రోజూ లక్షలాది మంది ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు క్షేమంగా చేర్చుతోందంటూ ట్వీట్ చేశారు. రాజేంద్రనగర్ బస్ డిపో కండక్టర్ అనూపరాణిని ప్రశంసిస్తూ సజ్జనార్ ఈ వ్యాఖ్యలు చేశారు. గడిచిన 24 ఏళ్లుగా ఆర్టీసీ ప్రయాణికులకు నవ్వుతూ, నవ్విస్తూ సేవ చేస్తున్నారంటూ అనూపరాణిని కొనియాడారు. అనూపరాణిపై ఓ మీడియా సంస్థ ప్రచురించిన కథనాన్ని ఈ ట్వీట్ తో షేర్ చేశారు. రాజేంద్రనగర్ బస్ డిపోకు చెందిన రాగమల్ల అనూపరాణి ఫ్రెండ్లీ కండక్టర్గా గుర్తింపు తెచ్చుకున్నారని పేర్కొన్నారు.

# గత పాలకులు వీరప్పన్ వారసులు

## : బండి సంజయ్



తిరుమల జులై 11,(జర్నలిస్ట్ వార్త):
గత వైసీపీ ప్రభుత్వంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. టీటీడీని రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చారని విమర్శించారు. స్వామి వారిపై భక్తి లేని వారు నామాలు పెట్టుకుని... స్వామికి, టీటీడీ ఆస్తులకు పంగనామాలు పెట్టారని మండిపడ్డారు. ఇతర మతస్తులకు అధికారాన్ని అప్పగించి తిరుమల క్షేత్రాన్ని అపవిత్రం చేశారని దుయ్యబట్టారు. గత ఐదేళ్లు వీరప్పన్ వారసుల చేతిలో టీటీడీ పాలన సాగిందని సంజయ్ అన్నారు. ఎర్రచందనం కొల్లగొట్టి వేల కోట్లను సంపాదించారని చెప్పారు. ఎర్ర చందనం స్మగ్లర్ల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని... వారిని వదిలి పెట్టబోమని అన్నారు. వేంకటేశ్వరస్వామి వారి దయ, భిక్షతో కార్యకర్త స్థాయి నుంచి కేంద్ర మంత్రి స్థాయికి ఎదిగానని చెప్పారు. ఈరోజు బండి సంజయ్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బండి సంజయ్ తో పాటు పలువురు బీజేపీ నేతలు కూడా స్వామి వారిని దర్శించుకున్నారు. కేంద్ర మంత్రి హోదాలో స్వామి వారిని బండి సంజయ్ దర్శించుకోవడం ఇదే తొలిసారి.

## ఎందుకు ఆ లోక్ సభ స్థానాలు గెలుచుకోలేకపోయాం ?

### : కురియన్ కమిటీ పోస్టుమార్టం

హైదరాబాద్,జులై 11,(జర్నలిస్ట్ వార్త):
నియోజకవర్గాల వారీగా విడివిడిగా అభ్యర్థులతో ఓటమికి గల కారణాలపై ఆరా తీస్తోంది. కురియన్తో పాటు రకీబుల్ హుస్సేన్, పర్గత్సింగ్లు ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. మూడు రోజుల పాటు వరుస భేటీలు ఉండనున్నాయి.ముందుగా సికింద్రాబాద్ సెగ్మెంట్ లో ఓటమికి గల కారణాలపై కమిటీ ఆరా తీసింది. కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ ఈ కమిటీతో భేటీ అయ్యారు. తర్వాత హైదరాబాద్ పార్లమెంటు అభ్యర్థి సమీర్ ఉల్లాతో కురియన్ నేతృత్వంలోని ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ మాట్లాడింది. మల్కాజ్ గిరి, చేవెళ్లలో ఓటమికి కారణాలపై అభ్యర్థులు సునీతా మహేందర్ రెడ్డి, రంజిత్ రెడ్డిని అడిగి తెలుసుకుంది. వరంగల్ ఎంపీ కడియం కావ్యతోనూ కమిటీ మాట్లాడింది. విజయానికి దోహదపడ్డ అంశాలపై ఆమెతో చర్చించింది. ఇక మెదక్, మహబూబ్ నగర్ అభ్యర్థులు నీలం మధు, వంశీచంద్ రెడ్డితోనూ కమిటీ మాట్లాడనుంది.గెలుపు, ఓటములతో సంబంధం లేకుండా కాంగ్రెస్ పార్టీ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ మీటింగ్ ఏర్పాటు చేయడం మంచి పరిణామమని సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ అభిప్రాయపడ్డారు. దేశంలో ఏ రాజకీయ పార్టీలో కూడా ఇలాంటి పద్ధతి లేదని, ఇది కొత్త విధానమని అన్నారు. జరిగిన లోపాలు సరిదిద్దు కోవడానికి మంచి అవకాశమని చెప్పారు. తన ఓటమికి కొన్ని పొరపాట్లు జరిగాయని, వాటిని కురియన్ కమిటీకి తెలియజేశానని అన్నారు.కురియన్ కమిటీ గెలిచిన, ఓడిన అభ్యర్థులతో సమావేశమైందని వరంగల్ ఎంపీ కడియం కావ్య చెప్పారు. పలుచోట్ల ఓటమికి కారణాలు అడగారన్నారు.. బీఆర్ఎస్ ఓటు బీజేపీకి టర్న్ అయ్యిందనట్లు చెప్పానన్నారు. తాను లోక్ సభ నియోజకవర్గం పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా నివేదిక ఇచ్చానని తెలిపారు. పార్టీ బలహీనంగా ఉన్నచోట ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలని కురియన్ అడిగారని అన్నారు.

## బైక్ ప్రమాదంలో మిస్టర్ తెలంగాణ మృతి



హైదరాబాద్,జులై 11,(జర్నలిస్ట్ వార్త):
రోడ్డు ప్రమాదంలో ప్రముఖ బాడీ బిల్డర్, మిస్టర్ తెలంగాణ విజేత మహ్మద్ సోహైల్ (23) ప్రాణాలు కోల్పోయాడు. మహ్మద్ సోహైల్ అతని స్నేహితుడు మహ్మద్ ఖదీర్తో కలిసి జూన్ 29వ తేదీన సిద్దిపేట నుంచి మిరిదొడ్డి వైపునకు బైక్పై వెళ్తుండగా ప్రమాదం జరిగింది. బైక్పై వేగంగా వెళ్తుండగా అదుపుతప్పి స్క్రాప్ ఆటోను ఢీకొట్టాడు. ఈ యాక్సిడెంట్లో తీవ్రంగా గాయపడిన అతను.. హైదరాబాద్లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు.సిద్దిపేట జిల్లాకు చెందిన సోహైల్ అనేక జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి, దక్షిణ భారత స్థాయి బాడీ బిల్డింగ్ ఛాంపియన్షిప్లను గెలుచుకున్నాడు. మిస్టర్ తెలంగాణ ఛాంపియన్షిప్లోనూ విజేతగా నిలిచాడు. బాడీ బిల్డింగ్లో గొప్ప భవిష్యత్తు ఉన్న సోహైల్.. ఇంత చిన్నవయసులోనే మరణించడం పట్ల అతని కుటుంబసభ్యులు, స్నేహితులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## యువతకు జాబ్స్ రాకుండా కేటీఆర్, హరీశ్‌రావు కుట్ర మంత్రి పొన్నం

హైదరాబాద్,జులై 11,(జర్నలిస్ట్ వార్త):
యువతకు జాబ్స్ రాకుండా చేయాలని బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు కుట్ర చేస్తున్నారని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం గాంధీ భవన్ లో ఆయన మీడియా మాట్లాడారు. ప్రతి పక్షాల ఉచ్చులో పడొద్దని ఆయన సూచించారు. అభ్యర్థులు చదువుకోవాల్సిన సమయాన్ని వృధా చేసుకోవొద్దని కోరారు. మేథావుల అభిప్రాయం తీసుకొని త్వరలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల పక్షాన ఉంటుందన్నారు.జీహెచ్ఎంసీ ఎన్నికల్లో రాజకీయ ఆట కోసం ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, హైదరాబాద్ ని మంత్రి కిషన్ రెడ్డి విమర్శిస్తున్నారని ఆరోపించారు. కేంద్ర మంత్రిగా ఉండి ఐదు ఏండ్లలో హైదరాబాద్ కు ఏం చేశారో, ఎన్ని నిధులు తెచ్చారో కిషన్ రెడ్డి చెప్పాలని ప్రశ్నించారు. బీఆర్ఎస్, బీజేపీ లు మిత్ర పక్షంగా ఉండి హైదరాబాద్ ను ఆగం చేసింది వాస్తవం కాదా? అని అన్నారు. అభివృద్ధిపై తమ మంత్రి వర్గంతో చర్చకు పిలిస్తే రాలేదని తెలిపారు. హైదరాబాద్ ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని వివరించారు.

# రెక్కాడితే గాని డొక్కాడని జీవితాలు

**వరంగల్, జులై 11,(జర్నలిస్ట్ వార్త):** ప్రపంచం అత్యంత వేగంగా టెక్నాలజీతో ముందుకు వెళుతోంది. రియల్ ఎస్టేట్ పేరుతో కొంతమంది వ్యాపారస్తులు వ్యవసాయ భూములను కొనుగోలు చేస్తూ, ప్లాట్లుగా తయారుచేసి, అమ్మకాలు చేస్తూ సొమ్ము చేసుకుంటూనే ఉన్నారు. దీంతో వ్యవసాయ భూములు, వ్యవసాయం అంతరించిపోయే ప్రమాదకర పరిస్థితి నెలకొంది. గతంలో చేతివాటంతోనే వ్యవసాయం కొనసాగించేవారు. ప్రస్తుతం వ్యవసాయానికి సంబంధిత మిషనరీ యంత్రాంగం ప్రవేశపెట్టి కూలీలకు పని లేకుండా చేశారన్నది నిజం. దీంతో వ్యవసాయ కూలీలు సహజీవనం కోసం రోజువారి కూలీలను వెతుక్కునే పనిలోనే ఉన్నారు. మరి కొంతమంది గ్రామీణ ప్రాంతాల ప్రజలు చేసుకోవడానికి కూలి పని దొరకకపోవడంతో వలస పోతున్నారు. ప్రస్తుతం ప్రతి గ్రామం నుంచి 30 శాతం మంది నిరుపేద వ్యవసాయ కూలీలు పట్టణాలకు వలసబోయి వాచ్మెన్ గాను, ఇళ్లల్లో పాచి పని చేస్తూ, జీవనం కొనసాగిస్తున్నారన్న విషయం ఎంతమందికి రుజువు. ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలు రోజువారి కూలీ కోసం దుకాణదారులను, కాంట్రాక్టు పనులు చేసే వారిని ప్రాధేయపడుతూ, దినసరి కూలి వెతుక్కుంటున్నారు. అలాంటివారికి నివాసం ఉండేందుకు సరైన ఇళ్లు లేక, వర్షాలు పడినప్పుడు చెట్టు క్రింద నివాసం ఉంటున్నట్లు కుటుంబ సభ్యులంత ఓ మూలన చేరి, తలదాచుకుని తడుస్తూనే జీవిస్తుంటారు. తెల్లవారితే కూలి పని దొరక్కపోతే ఆరోజు మూడు పూటలు నోట్లోకి 5 వేళ్ళు వెళ్లే ప్రసక్తే ఉండదు. కుటుంబ పోషణ కర్త మంచినీటితో కడుపు నింపుకుని, వీలైతే ఇరువురు దంపతులు ఒక పూటపస్తులు ఉండి, కడుపున పుట్టిన పిల్లలకు అన్నం పెట్టేందుకు ప్రయత్నం చేస్తారు. కర్మ బాగోలేక ఏదైనా అనారోగ్య పరిస్థితులు ఆ కుటుంబంలో ఎవరికి వ్యాపించిన అంతే సంగతులు. ప్రస్తుతం వైద్య వ్యవస్థలో పరిస్థితులు ఏ విధంగా ఉన్నాయో ప్రతీ ఒక్కరికీ తెలిసిన విషయమే. కాలానికి అనుగుణంగా సీజనల్ వ్యాధులు ఏర్పడి ఏదైనా అనారోగ్య సమస్య వచ్చి, ఆసుపత్రులను ఆశ్రయిస్తే, రక్త పరీక్షలు, మూత్ర పరీక్షలు, తదితర పరీక్షలు నిర్వహించి, స్థాయికి మించిన మందులు రాస్తారు. లక్షలతో కూడిన వ్యవహారమైతే అప్పుడు ఆ కుటుంబానికి కనిపించేది నరకయాతనే. ఉండడానికి ఇల్లు లేక, చేతినిండా పని లేక, తినడానికి తిండి లేని ఆ పరిస్థితిని గమనించిన స్థానికులు వారు నోరు తెరిచే అప్పు అడిగిన ఒక్క రూపాయి బదులు ఇచ్చే పరిస్థితి ఉండదు. బ్యాంకులను ఆశ్రయిస్తే షిరిడి లేకుండా ఇవ్వమంటారు. ఏదైనా గట్టి కష్టం వచ్చినట్లయితే ప్రాణాలు కోల్పోయే దుస్థితి దాపరిస్తోంది. ఇలాంటి దారుణమైన పరిస్థితులు ప్రతిరోజు దినచర్యగా అనుభవిస్తున్న అనేక నిరుపేద, వ్యవసాయ కూలీలకు దిక్కులేని పరిస్థితి ఏర్పడింది.

అలాంటి వారి అభ్యున్నతి కోసం రెండు చేతుల పనిచేసే కుటుంబాన్ని పోషించుకునే అవకాశం కల్పించాలి, కుటుంబ సభ్యులంతా వర్షం వస్తే రాత్రంతా జాగారం చేస్తున్నట్లుగా ఇబ్బందులు పడుతున్న వారిపై దృష్టి పెట్టి ఇళ్ల నిర్మాణం చేపట్టాలి, అన్ని రకాల కార్పొరేట్ ఆసుపత్రుల్లో సైతం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం అమలులో ఉండే విధంగా ప్రణాళికలు రూపొందించాలని వ్యవసాయ కూలీలు కోరుతున్నారు.

## భూస్వాములకు రైతుబంధు ప్రవేశపెట్టారు..

### - భూమిలేని వారికి ఏదైనా పథకం పెట్టొచ్చు కదా..?

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత టిఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాల కాలం పాటు అధికారాన్ని శాసించింది. అదే క్రమంలో భూస్వాములకు మేలు జరిగే విధంగా రైతుబంధు ప్రవేశపెట్టి వారికి ఆర్థిక మాన్యాన్ని పెంచింది. నిజానికి భూమి కలిగిన వారే వ్యవసాయం చేసింది లేదు. భూమిలేని నిరుపేద వారు భూస్వాముల వద్ద కౌలుకు తీసుకుని వ్యవసాయం చేశారు. కష్టం ఒకరిది, ప్రతిఫలం మరొకరిది అన్న చందంగా ప్రభుత్వం భూస్వాములకే అవకాశాన్ని కల్పించింది. ఇలా ఎకరాల తరబడి భూములు ఉన్న భూస్వాములకు ప్రభుత్వం అందిస్తున్న రైతుబంధు సహాయం, కౌలుకు తీసుకున్న కౌలుదారు ఇచ్చిన ఆదాయం భూస్వామికే వర్తిస్తుంది. అదృష్టం బాగోలేక పంట నష్టం జరిగితే, వ్యవసాయం ప్రయత్నించిన కౌలుదారే నష్టపోతాడు తప్ప, భూస్వామి కి ఇవ్వాల్సిన ఆదాయం ఏ మాత్రం తగ్గదు. అప్పటికి భూస్వామి కుటుంబంలో సభ్యులకు ఏదైనా సమస్య వస్తే ఏ బ్యాంకు అయినా భూమి ఆధారాలు పెడితే అప్పుగా లక్షల రూపాయలు ఇస్తారు. లేదా తనకున్న భూమిలో కొంత భూమిని విక్రయిస్తే వచ్చిన కష్టాలు తొలగిపోతాయి. వ్యవసాయ కూలీలు ఇలా ఎన్ని ప్రయత్నాలు చేసినా, అడుగు స్థాయిలోనే ఉండే జీవితాలకు భరోసా కల్పించేలా ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వమైనా వ్యవసాయ కూలీలపై కనికరం చూపించి, నూతన పథకాన్ని ప్రవేశపెట్టాలని కోరుతున్నారు.

## పథకాలు ప్రవేశపెట్టేటప్పుడు సర్వేలు చేపట్టాలి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల ముందు మేనిఫెస్టో ద్వారా 6 గ్యారంటీ పథకాలను అమలులోకి తీసుకువస్తామని వాగ్దానం చేశారు. ప్రస్తుతం ఒక్కొక్కటిగా పథకాలను అమలు చేస్తూ వస్తున్నారు. దీంతో ఇచ్చిన హామీలను మాట తప్పకుండా అమలు చేస్తున్న ప్రభుత్వమని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు ప్రశంసిస్తున్నారు. ఆరు గ్యారెంటీ పథకాల్లో ప్రతి మహిళకు 2500 చొప్పున అందిస్తామని చెప్పారు. అందులో మొట్టమొదటిగా రైతుబంధు పథకం వలె వందలాది ఎకరాలు ఉన్న రైతులకు రైతుబంధు అందజేసినట్లు కాకుండా, ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. మొట్టమొదటిగా ఎలాంటి ఆధారం లేని మహిళలను రాష్ట్ర వ్యాప్తంగా సర్వే ద్వారా గుర్తించాలి. అలాంటి పేద వర్గాలకు చెందిన వారికి మొదటి ప్రాధాన్యతగా ఈ పథకం వర్తించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# కూలీలతో నాటు వేసిన కాంగ్రెస్ నాయకురాలు ఝాన్సీరెడ్డి



రాయపర్తి, జులై 11,(జర్నలిస్ట్ వార్త): రైతులతో మాట్లాడడానికి గురువారం పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ హనుమండ్ల ఝాన్సీ రెడ్డి నేరుగా వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లారు. రాయపర్తి మండలం మైలారం గ్రామంలోని ఓ వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి కూలీలతో కలిసి నాటు వేశారు. అనంతరం వ్యవసాయం పట్ల రైతులకు ఏర్పడుతున్న కష్టనష్టాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా రైతులతో కాంగ్రెస్ ప్రభుత్వం హాయంలోనే రైతులకు మేలు జరుగుతుందని చెప్పారు. త్వరలోనే రైతు రుణమాఫీ చేసి రైతులను ఆదుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పెద్దగాని సోమయ్య, జైపాల్ రెడ్డి, విజేందర్ రెడ్డి, బుచ్చి రెడ్డి తదితరులు ఉన్నారు.?

# ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని కలిగి ఉండాలి

### - మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



రాయపర్తి, జులై 11,(జర్నలిస్ట్ వార్త): ప్రతీ ఒక్కరు భక్తి భావాన్ని కలిగి ఉండాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. గురువారం మండలంలోని వెంకటేశ్వరపల్లి గ్రామంలోని స్వయం వక్త శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన మోటుపల్లి రంగాచార్య స్వామి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాల్గొన్నారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చిన్న జీయర్ స్వామితో కలిసి విగ్రహ ఆవిష్కరణ చేశారు. అనంతరం వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవారాధన తోనే ఆధ్యాత్మిక చింతన, మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు జినుగు అనిమిరెడ్డి, రంగు కుమార్ గౌడ్, పూస మధు, ఎండి నయీమ్, గారె నర్సయ్య, ఎండి అఫ్సర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# వర్ధన్నపేటలో నేడు సదరం క్యాంపు

### - సూపరింటెండెంట్ డాక్టర్ నరసింహ స్వామి



వర్ధన్నపేట, జులై 11,(జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నేడు సదరన్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు గురువారం సూపరింటెండెంట్ డాక్టర్ నరసింహ స్వామి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్లైన్ ద్వారా స్లాట్ బుక్ చేసుకున్న వారు సదరం క్యాంప్ లో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



వర్ధన్నపేట, జులై 11,(జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట మున్సిపల్ పట్టణ కేంద్రంలోని మూడవ వార్డుకు చెందిన కొండేటి సాయమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం సమాచారం తెలుసుకున్న వర్ధన్నపేట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొండేటి బాలకృష్ణ, ఎర్ర శ్రీకాంత్ మృతురాలి పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి వ్యక్తపరిచారు. వారి వెంట పట్టణ పరిధిలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# చింతలతండ గ్రామంలో దారుణం

## - హత్య ప్రయత్నంలో ఇద్దరు దంపతులు మృతి - జరిగిన ఘటనలో మరో ఇద్దరికి గాయాలు

- క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించిన స్థానికులు - జరిగిన హత్యలకు పట్టణ కేంద్రంలో ధర్నా
- సమయమనం పాటించిన పోలీసులు - మొదట పోలీస్ స్టేషను ఎదుట బైటాయింపు
- నర్సంపేట చౌరస్తాలో ర్యాలీ ప్రదర్శన- నిరసన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి
- ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ ఆధ్వర్యంలో చర్చలు - కలెక్టర్ హామీతో నిరసనకు తెర

**నర్సంపేట, జూలై 11,(జర్నలిస్ట్ వార్త):**



నర్సంపేట నియోజకవర్గం పరిధిలోని చెన్నారావుపేట మండలంలోని చింతల తండా గ్రామంలో గురువారం దారుణం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం బానోతు సుగుణ, శ్రీనివాస్ దంపతులపై గూడూరు మండలం గుండెంగ గ్రామానికి చెందిన మేకల నాగరాజు అలియాస్ (బన్నీ) అనే యువకుడు తల్వార్ తో తెల్లవారు జామున దారుణానికి ఒడిగట్టాడు. బానోతు శ్రీనివాస్ కుటుంబ సభ్యులంతా నిద్రిస్తున్న సమయంలో దాడి చేశాడు. జరిగిన ఘటనలో శ్రీనివాస్ సుగుణ దంపతులు అక్కడికక్కడే మృతి చెందారు. వారి కూతురు దీపిక కుమారుడు మదన్ లాల్ గాయపడ్డారు. గమనించిన చుట్టుప్రక్కల స్థానికులు ఘటన స్థలాన్ని చేరుకోగా గాయాలతో రోధిస్తున్న శ్రీనివాస్ కూతురు కుమారున్ని చూసిన స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకుని దర్యాప్తు చేపట్టారు. గత సంవత్సరం నవంబర్ మాసంలో ఘాతుకానికి పాల్పడిన నాగరాజు అనే వ్యక్తితో మృతి చెందిన దంపతుల కుమార్తె దీపికకు ప్రేమ వివాహమైనట్లు స్థానికులు చెబుతున్నారు. పెళ్లయిన రెండు నెలల తర్వాత జనవరిలో మనస్పర్థలు ఏర్పడి గ్రామంలోని పెద్దల సమక్షంలో విడిపోయినట్లు తెలుపుతున్నారు. ప్రేమ వివాహం రద్దయిన కారణంగా మనస్థాపానికి లోనైనా నాగరాజు ఈ దారుణానికి పాల్పడి కుటుంబం మొత్తాన్ని హత్య చేయడానికి ప్రయత్నించినట్లు వివరిస్తున్నారు. ఈ ఘటనలో తల్లిదండ్రులు మృతి చెంది, దీపిక తన సోదరుడు అదృష్టవశాత్తు గాయాలతో బయటపడ్డారని తెలిపారు. జరిగిన హత్యకు నిరసనగా కుటుంబ సభ్యులు, వివిధ సంఘాల నాయకులు నర్సంపేట పట్టణ కేంద్రంలో ధర్నా చేపట్టారు. మొదట మార్చురీ వద్ద నిరసన తెలిపిన గ్రామస్తులు ఆ తరువాత పోలీసు స్టేషను వద్ద కొద్దిసేపు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ర్యాలీగా వచ్చి చౌరస్తా లో భారీ ఎత్తున ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వాహన దారులకు రాకపోకల మధ్య కొంత సమయం పాటు అంతరాయం ఏర్పడింది. ఉన్మాది నాగరాజును ఉరి తీయాలని, ఎన్కౌంటర్ చేయాలని కోరుతూ, బాధిత కుటుంబ సభ్యులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఏసిపి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో చర్చలు జరిపారు. ఈ ఘటనలో ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ హాజరై కలెక్టర్ తో మాట్లాడారు. కుటుంబ సభ్యులకు చట్ట ప్రకారం ఆర్థిక సాయం, హామీలను అమలు చేస్తామని, నిందితుడిని చట్ట ప్రకారం శిక్షిస్తామని హామీ ఇవ్వడంతో నిరసనకు తెరపడింది. గ్రామస్తులు చేపట్టిన నిరసన సమయంలో పోలీసులు సంయమనం పాటించడం మూలంగా నిరసన కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. ఈ ధర్నా కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి హాజరై బాధిత కుటుంబ సభ్యులకు చట్ట ప్రకారం న్యాయం జరగకపోతే బాధిత సభ్యులతో డీజీపీ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం బాధిత కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. జరిగిన ఘటనలో లా అండ్ ఆర్డర్ పరిరక్షణలో భాగంగా ఉన్నత అధికారులతో పాటు సిఐలు రమణమూర్తి, రాజ గోపాల్, ఎస్సైలు ప్రవీణ్, రాజారాం, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

# నియోజకవర్గ సమస్యలు మంత్రికి దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే దొంతి

నర్సంపేట, జూలై 11,(జర్నలిస్ట్ వార్త): రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం పరిధిలోని పలు ప్రజా సమస్యలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివరించిన సమస్యల పట్ల మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే ఓ ప్రకటన ద్వారా పేర్కొన్నారు. వారి వెంట పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



# సమీపిస్తున్న ఐటీఆర్ ఫైలింగ్ గడువు..

## ఇంట్లో కూర్చొని ఈజీగా ఇలా పూర్తి చేయవచ్చు!

హైదరాబాద్,జులై 11,(జర్నలిస్ట్ వార్త):
ఆదాయ పన్ను రిటర్న్-2024 దాఖలకు గడువు సమీపిస్తోంది. వేతన జీవులైనా లేదా వ్యాపార యజమానులైనా జులై 31 లోగా రిటర్న్ దాఖలు చేయాల్సి ఉంటుంది. అయితే గడువు సమీపించే వరకు వేచిచూడడం మంచిది కాదని, గడువు తేదీ కంటే ముందుగానే ఫైల్ చేయడం ద్వారా లోపాలను సరిదిద్దుకునేందుకు అవకాశం ఉంటుందని చెల్లింపుదారులకు నిపుణులు సూచిస్తున్నారు. వీలైతే చార్టర్డ్ అకౌంటెంట్‌ల సహాయం తీసుకోవచ్చని, లేదంటే సొంతంగా ఇంట్లో కూర్చొని కూడా ఆన్‌లైన్‌లో ఫైల్ చేయవచ్చునని సలహా ఇస్తున్నారు. ఆదాయపు పన్ను విభాగం వెబ్‌సైట్ ద్వారా రిటర్న్ చేయవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. ఆన్‌లైన్‌లో సొంతంగా ఆదాయ పన్ను రిటర్న్స్ దాఖలు చేయాలనుకునేవారు ఈ స్టెప్స్ పాటించి పూర్తి చేయవచ్చునని చెబుతున్నారు.




### ఆన్‌లైన్‌లో దశల వారీగా ఇలా పూర్తి చేయాలి..

ఆదాయపు పన్ను ఇ-ఫైలింగ్ వెబ్‌సైట్ incometax.gov.in/iec/foportal/ ఓపెన్ చేయాలి.
ఒకవేళ రిజిస్టర్డ్ వినియోగదారుడైతే యూజర్ ఐడీ, పాస్‌వర్డ్, క్యాప్చా కోడ్‌ని ఉపయోగించి పోర్టల్‌లోకి లాగిన్ కావొచ్చు. ఒకవేళ కొత్త వినియోగదారులైతే రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది.
పోర్టల్‌లోకి లాగన్ అయ్యాక 'ఈ-ఫైల్' మెనూలోకి వెళ్లి 'ఆదాయ పన్ను రిటర్న్స్'ని సెలక్ట్ చేసుకోవాలి.
ఆదాయాన్ని బట్టి తగిన ఐటీఆర్ ఫారమ్‌ను ఎంచుకోవాలి. ఫామ్-16 ఉంటే ఐటీఆర్-1 లేదా ఐటీఆర్-2 ఎంచుకోవాలి.
అసెస్‌మెంట్ ఇయర్ దగ్గర 2024-25ను ఎంచుకోవాలి.
వ్యక్తిగత సమాచారం, ఆదాయానికి సంబంధించిన వివరాలు, మినహాయింపులు, చెల్లించిన పన్ను వంటి వివరాలు అన్నింటినీ నింపాలి.
అన్ని వివరాలను ఎంటర్ చేసిన తర్వాత పూర్తిగా చెక్ చేసుకొని తప్పులను సరిదిద్దుకోవాలి. వివరాలన్నింటినీ ధ్రువీకరించుకోవాలి.
వివరాలు అన్నింటినీ నిర్ధారించుకున్నాక 'సబ్మిట్' ఆప్షన్‌పై క్లిక్ చేయాలి.
ఫామ్ సమర్పించిన తర్వాత ఆధార్ ఓటీపీ లేదా అందుబాటులో ఉన్న ఆప్షన్లను ఉపయోగించి రిటర్న్‌ను ధ్రువీకరించుకోవాలి.
ఆ తర్వాత అప్‌లోడ్‌పై క్లిక్ చేయాలి.

### ఎవరెవరు చేయాలి?

కాగా ఆదాయ పన్ను చాప్టర్ 6-ఏలోని 80సీ, 80సీసీసీ, 80సీసీడీ, 80డీ, 80ఈ, 80జీ, 80జీజీఏ, 80టీటీఏ/80టీటీబీ వంటి వివిధ సెక్షన్‌ల కింద మినహాయింపులు పొందాక కూడా పరిమితికి మించి ఆదాయం పొందుతున్నవారు ఆదాయ పన్ను దాఖలు చేయాల్సి ఉంటుంది. ఇక విదేశాల్లో నివసిస్తున్న ఎన్నారైలు సైతం ఇక్కడి లాభదాయకమైన ఆస్తులపై వచ్చే ఆదాయానికి సంబంధించి తప్పనిసరిగా ఐటీఆర్ ఫైల్ చేయాల్సి ఉంటుంది.

### ఐటీఆర్ ఫైలింగ్‌కు కావాల్సిన పత్రాలు..

ఆన్‌లైన్‌లో ఐటీఆర్ ఫైల్ చేయాలనుకునేవారు కొన్ని ముఖ్యమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలి. ఫామ్-16, ఫారం 16ఏ, ఫారం 26ఏఎస్, క్యాపిటల్ గెయిన్స్ స్టేట్‌మెంట్స్, పన్ను ఆదా పెట్టుబడులకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను సిద్ధం చేసుకోవాలి. ఐటీఆర్ ఫైలింగ్‌కు ఈ పత్రాలు తప్పనిసరిగా అవసరం.

# రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ సేవలకు అంతరాయం



హైదరాబాద్,జులై 11,(జర్నలిస్ట్ వార్త):
తెలంగాణ వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ల సేవలు నిలిచిపోయాయి. సాంకేతిక సమస్యల కారణంగా రిజిస్ట్రేషన్ సేవల్లో అంతరాయం ఏర్పడింది. ఆధార్ లింక్ కాకపోవడంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సేవలు స్తంభించాయి. యూడీఐఏలో ఈకేవైసీలో వెరిఫికేషన్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది.ఢిల్లి కేంద్రంగా యూఐడీఏఐ ఆధార్ సేవలను అందిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ప్రతి డాక్యుమెంట్‌కు ముందు సబ్ రిజిస్ట్రార్లు తమ ఆధార్ ఆటో వెరిఫికేషన్ చేయాలని తెలంగాణ ప్రభుత్వం గతంలో నిర్ణయించి అమలు చేస్తోంది. గురువారంనాడు ఆధార్ అథెంటికేషన్ పనిచేయలేదు. వెరిఫికేషన్ ఫెయిల్ కావడంతో సాంకేతిక సమస్య రిజిస్ట్రేషన్ సేవలపై పడింది.సబ్ రిజిస్ట్రార్ అథెంటికేషన్‌తో పాటు, క్రయ విక్రయదారుల ఆధార్ వెరిఫికేషన్ కూడా నిల్చిపోవడంతో పూర్తిగా 143 రిజిస్ట్రేషన్ కార్యాలయాలు, తహశీల్దార్ కార్యాలయాల్లోని ధరణి రిజిస్ట్రేషన్లు కూడా నిల్చిపోయాయి. దీంతో స్లాట్ బుక్ చేసుకుని రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన జనం కార్యాలయం వద్ద పడిగాపులు కాశారు.ఇండ్లు, ప్లాట్ల క్రయ విక్రయాల కోసం స్లాట్ చేసుకున్న వారంతా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద గంటల తరబడి నిరీక్షించారు. చలాన్లు చెల్లించి డాక్యుమెంటేషన్ సిద్ధం చేసుకున్న క్రయవిక్రయ దారులు సేవలు నిల్చిపోవడంతో సాయంత్రం వరకు వేచిచూశారు. దీంతో గురువారం స్లాట్ బుక్ చేసుకున్న రిజిస్ట్రేషన్లు శుక్రవారం పూర్తి చేస్తామని అధికార వర్గాలు తెలిపాయి.వాస్తవానికి ప్రతిరోజూ రాష్ట్రవ్యాప్తంగా 5 వేల నుంచి 7 వేల రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. దీంతో రూ.60 కోట్ల నుంచి రూ.70 కోట్ల వరకు ప్రభుత్వానికి ఆదాయానికి గండిపడింది. గతంలో ఇదే తరహాలో సాంకేతిక సమస్య తలెత్తిన విషయం తెలిసిందే. మరోసారి ఇదే సమస్య తలెత్తింది.

## తెలంగాణ డీఎస్సీ పరీక్షల హాల్ టిక్కెట్లు విడుదల




హైదరాబాద్,జులై 11,(జర్నలిస్ట్ వార్త):
తెలంగాణలో ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి నిర్వహించే డీఎస్సీ పరీక్షల హాల్ టిక్కెట్లు విడుదలయ్యాయి. డీఎస్సీ పరీక్షలు ఈ నెల 18 నుంచి ఆగస్ట్ 5వ తేదీ వరకు జరగనున్నాయి.ఆన్ లైన్ విధానంలో ఈ పరీక్షలు ఉండనున్నాయి. డీఎస్సీ పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 2.7 లక్షల మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం 11,062 టీచర్ పోస్టుల భర్తీకి జూన్ 20 వరకు దరఖాస్తులు స్వీకరించారు.అభ్యర్థులు తమ పేమెంట్ రిఫరెన్స్ ఐడీ లేదా ఆధార్ నెంబర్, పోస్ట్ కేటగిరి, మాధ్యమం, పుట్టిన తేదీ తదితర వివరాలను ఎంటర్ చేసి హాల్ టిక్కెట్లను పొందవచ్చు.

# మణిపూర్‌లో శాంతి కోసం

## ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం: రాహుల్ భరోసా



న్యూఢిల్లీ: జులై 11,(జర్నలిస్ట్ వార్త):
మణిపూర్‌లో శాంతిని పునరుద్ధరించి, ఈ విషాదాన్ని అంతం చేయడానికి కాంగ్రెస్, ఇండియా కూటమి కేంద్ర ప్రభుత్వంపై పూర్తి శక్తితో ఒత్తిడి తీసుకువస్తాయని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. జాతుల మధ్య ఘర్షణతో సంక్షుభితంగా మారిన మణిపూర్‌లో గత సోమవారం పర్యటించిన రాహుల్ గాంధీ గురువారం తన సోషల్ మీడియా ఖాతాలో ఒక వీడియోను పోస్టు చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ కూడా మణిపూర్‌ను సందర్శించి అక్కడి ప్రజల ప్రజలను ఆలకించి శాంతి కోసం పిలుపునిచ్చాలని రాహుల్ విజ్ఞప్తి చేశారు. మణిపూర్ ప్రజలతో తాను జరిపిన సంభాషణలకు సంబంధించిన వీడియోను షేర్ చేసిన రాహుల్ మణిపూర్‌లో గత ఏడాది ఘర్షణలు చెలరేగిన తర్వాత తాను మూడు సార్లు ఆ రాష్ట్రాన్ని సందర్శించానని తన పోస్టులో తెలిపారు.
దురదృష్టవశాత్తు ఇప్పటికీ ఆ రాష్ట్రంలో పరిస్థితిలో ఎటువంటి మార్పురాలేదని, నేటికీ రాష్ట్రం రెండు భాగాలుగా చీలిపోయిందని ఆయన చెప్పారు.ఇళ్లు దగ్ధమవుతున్నాయని, అమాయక ప్రజల ప్రాణాలు ప్రమాదంలో ఉన్నాయని, వేలాది కుటుంబాలు బలవంతంగా సహాయ శిబిరాలలో ఉండాల్సి వస్తోందని రాహుల్ తెలిపారు. ఈ సంక్షోభాన్ని ముగించడానికి కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు పూర్తి శక్తితో పార్లమెంట్‌లో తమ గళం వినిపిస్తామని ఆయన తెలిపారు. వివిధ సహాయ శిశిరాలలో తలదాచుకున్న నిర్వాసితులు తమ గోడును రాహుల్ వద్ద వెళ్లబోసుకోవడం ఆ వీడియోలో కనిపించింది. తమ కోసం పోరాడాలని, తమ గొంతును పార్లమెంట్‌లో వినిపించాలని వారు రాహుల్‌ను అభ్యర్థించారు.మణిపూర్ ప్రజల సమస్యలను తమ ఎంపీలు పార్లమెంట్‌లో ప్రస్తావించిన విషయాన్ని రాహుల్ వారికి తెలిపారు. రానున్న బడ్జెట్ సమావేశాలలో తమ పూర్తి శక్తితో మీ సమస్యలు తెలియచేస్తామని ఆయన వారికి హామీ ఇచ్చారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురాగలమని వారికి ఆయన చెప్పారు. మీకు సాయపడగలను..మీ సమస్యను లేవనెత్తి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురాగలను. కాని మీరు ఎప్పుడు మీ ఇళ్లకు తిరిగి వెళ్లగలరో మాత్రం నేను హామీ ఇవ్వలేను. ఎందుకంటే దానికి ప్రభుత్వమే సమాధానం చెప్పగలదు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో మీ గొంతును వినిపిస్తాను అని ఆయన వారికి హామీ ఇవ్వడం ఆ వీడియోలో కనిపించింది. గత ఏడాది మే 3న మణిపూర్‌లోని మైతీ, కుకీ తెగల మధ్య హింస ప్రజ్వరిల్లి 200 మందికి పైగా మరణాలకు దారితీసింది. వేలాదిమంది నిరాశ్రయులయ్యారు. వందలాది ప్రైవేట్, ప్రభుత్వ భవనాలు అగ్నికి ఆహుతయ్యాయి.

# ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుపై పిటిషన్.. విచారణ వాయిదా



హైదరాబాద్,జులై 11,(జర్నలిస్ట్ వార్త):
పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ పై గురువారం (జూలై 11) తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. ఏజీ సుదర్శన్ రెడ్డి వాదనల తర్వాత ఈ పిటిషన్‌పై విచారణను హైకోర్ట్ సోమవారానికి వాయిదా వేసింది.ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేం దర్, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావులపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ నేతలు పిటిషన్ వేశారు. హైకోర్టు విచారణ సందర్భంగా అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి కోర్టుముందు వాదనలు వినిపించారు. వాదోపవాదాలు విన్న హైకోర్టు.. తదుపరి విచారణను సోమవారానికి (జూలై 15) వాయిదా వేసింది.

# ప్రయాణికులకు గుడ్‌న్యూస్.. టీజీఎస్‌ఆర్టీసీ కీలక నిర్ణయం





హైదరాబాద్,జులై 11,(జర్నలిస్ట్ వార్త):
తెలంగాణ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారికి గుడ్‌న్యూస్. డిజిటల్ చెల్లింపులతో బస్ టికెట్లు ఇచ్చేలా ఆర్టీసీ గ్రేటర్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గూగుల్ పే, ఫోన్ పేతో పాటు క్రెడిట్, డెబిట్ కార్డుల ద్వారా టికెట్లు జారీ చేయనున్నట్లు ఆర్టీసీ అధికారులు వెల్లడించారు.
అయితే తెలంగాణ వ్యాప్తంగా కాకుండా ముందుగా హైదరాబాద్ సిటీ బస్సుల్లో ఈ డిజిటల్ చెల్లింపులను ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఐటిమ్స్ (ఇంటెలిజెంట్ టికెట్ ఇష్యూ మిషన్)లో లేటెస్ట్ సాఫ్ట్‌వేర్ అప్డేట్ చేశారు. ప్రయాణికులు గూగుల్ పే, ఫోన్‌పే, పేటీఎం, డెబిట్, క్రెడిట్‌కార్డులతో పాటు ఇతర డిజిటల్ చెల్లింపుల ద్వారా టికెట్లు పొందవచ్చు. ఇప్పటికే బండ్లగూడ డిపో పరిధిలో ఆర్టీసీ అధికారులు ఐటిమ్స్‌ను ప్రయోగాత్మకంగా పరిశీలించారు.
ఐటిమ్స్ వినియోగంపై కండక్టర్లకు పూర్తి స్థాయిలో ట్రైనింగ్ ఇవ్వడంతో పాటూ బస్సుల్లో రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో ఎలాంటి సమస్యలు వస్తున్నాయనే విషయాన్ని అధికారులు గుర్తిస్తున్నారు. ప్రస్తుతం దిల్‌సుఖ్‌నగర్-పటాన్‌చెరు (218) మార్గంలో ఐటిమ్స్‌తో డిజిటల్ పేమంట్ల ద్వారా టికెట్లు జారీ చేస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు వెల్లడించారు.

# బీఆర్ఎస్ కు బై.. కాంగ్రెస్‌లో చేరనున్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

హైదరాబాద్,జులై 11,(జర్నలిస్ట్ వార్త):
ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి తర్వాత ఆ పార్టీ నుంచి వలసలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్ కు చెందిన ఏడుగురు ఎమ్మెల్యేలు, 8మంది ఎమ్మెల్సీలు హస్తం కండువా కప్పుకున్నారు. కాగా, తాజాగా మరో బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాంగ్రెస్ లో చేరేందుకు రెడీ అయ్యారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ రేపు (జూలై 12) కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారు.సీఎం రేవంత్ రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో ప్రకాశ్ గౌడ్ కాంగ్రెస్ లో చేరనున్నారు. ఇప్పటికే ప్రకాశ్ గౌడ్ ఒకసారి సీఎం రేవంత్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ తిరుపతి వెళ్లారు. రేపు మధ్యాహ్నం తిరిగి హైదరాబాద్ రానున్నారు. రేపు సాయంత్రం 7 గంటలకు ఆయన కాంగ్రెస్ లో చేరనున్నారు.





# ట్రోలింగ్ పోస్టులు పెడితే ఊరుకోం..


## తెలుగు యూట్యూబర్‌లకు మంచు విష్ణు వార్నింగ్

ఎ సోషల్ మీడియాలో చిన్న పిల్లలు, హీరో హీరోయిన్లపై డార్క్ కామెడీ పేరుతో ట్రోలింగ్ చేస్తూ ఎవరైనా వీడియోలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు తెలిపారు. నటినటులను విమర్శిస్తూ చేసిన వీడియోలను, కామెంట్లను 48గంటల్లో తొలగించాలని లేకపోతే వారిపై కఠిన చర్యలు ఉంటాయని మంచు విష్ణు హెచ్చరించాడు. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా ప్రత్యేక వీడియో విడుదల చేశాడు.తెలుగు వారు అంటే వరల్డ్ వైడ్‌గా మంచి గుర్తింపు ఉంది. తెలుగు వాళ్లు అంటే మర్యాదస్తులు, పద్దతిగా ఉంటారు, ట్రెడిషన్స్ ఫాలో అవుతారు అని చెబుతారు. కానీ ఈ మధ్య కాలంలో కొంతమంది తెలుగు యూట్యూబర్స్, ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లూయెన్సర్స్ అసభ్యకరంగా ప్రవర్తించడం వలన మొత్తం తెలుగు జాతికి ఈ చెడ్డ పేరు వస్తుంది. ఈ మధ్య తెలుగు యూట్యూబర్ ఫనుమంతు చిన్న పిల్లలపై చేసిన నీచపు కామెంట్లపై నా తమ్ముడు సాయి ధరమ్ తేజ్ స్పందించడం వలన ఈ ఘటన నాకు తెలిసింది. ఇది ఎంత భయకరంగా ఉంది అంటే తెలంగాణ ప్రభుత్వం దీనిపై స్పందించడం మంచి విషయం. ఈ విషయంలో తెలంగాణ ప్రభుత్వానికి థాంక్స్ చెబుతున్నాను.ఈ హనుమంతు నిజానికి మంచి కుటుంబం నుంచి వచ్చాడు అయిన కూడా ఇతడు ఇంతలా తండ్రి కూతుళ్లపై అసభ్యకరంగా కామెడీ చేసి ఎందుకు ఆనందపడుతున్నారనేది నాకు అర్థం కాలేదు. అది చాలా పెద్ద తప్పు. అసలు మన తెలుగువాళ్ళం అలాంటి వాళ్ళం కాము కానీ, కామెడీ పేరుతో ఇలాంటి వీడియోలు చేయడం కరెక్ట్ కాదని మంచు విష్ణు చెప్పుకొచ్చారు.అలాగే నటినటులను విమర్శిస్తూ చేసిన వీడియోలను, కామెంట్లను 48గంటల్లో తొలగించాలని లేకపోతే వారిపై కఠిన చర్యలు ఉంటాయని మంచు విష్ణు హెచ్చరించాడు. ఇలాంటి వీడియోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేసే వాళ్లపై సైబర్ సెక్యూరిటీ వాళ్లకు పిర్యాదు చేస్తామని విష్ణు హెచ్చరించారు. ఇక నుంచి సోషల్ మీడియాలో ఉన్న వారందరూ తమ తీరును మార్చుకోవాలని మంచు విష్ణు కోరారు.




# విడుదల తేదీని లాక్ చేసిన 'తిరగబడరా సామి'

టాలీవుడ్ యంగ్ హీరో రాజ్ తరుణ్ 'తిరగబడరా సామి' తో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నాడు. పిల్లా నువ్వు లేని జీవితం ఫేమ్ ఏఎస్ రవికుమార్ చౌదరి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మాల్వీ మల్హోత్రా కథానాయికగా నటించింది.
తాజాగా మూవీ మేకర్స్ ఈ సినిమా ఆగష్టు 2న విడుదల కానున్నట్లు ఆన్లైన్ లో స్పెషల్ పోస్టర్ ని విడుదల చేసి అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రంలో రఘుబాబు, బిత్తిరి సత్తి, మరియు రాచ రవి కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమాలో మకరంద్ దేశ్‌పాండే విలన్ పాత్రను పోషిస్తుండగా, మన్నారా చోప్రా కీలక పాత్ర పోషిస్తుంది. ఈ చిత్రానికి భోలే షావలి సంగీతం సమకూర్చారు. సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ మీడియా ఈ ప్రాజెక్ట్‌ని నిర్మిస్తోంది.



# మిస్టర్ బచ్చన్ నుంచి ఫస్ట్ సింగిల్ రిలీజ్

రవితేజ కథానాయకుడిగా హరీష్‌శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది. బుధవారం ఈ సినిమాలోని తొలి గీతాన్ని విడుదల చేశారు. మిక్కీ జే మేయర్ స్వరపరచిన ఈ పాటను సాహితీ రచించారు. 'చిట్టిగువ్వ పిట్టలాంటి చక్కనమ్మా..బొట్టు పెట్టి పట్టుచీర కట్టుకోమ్మ జట్టుకట్టి చుట్టమల్లె చుట్టుకోమ్మా..' అంటూ చక్కటి భావాలతో ఈ పాట సాగింది. కశ్మీర్ నేపథ్యంలో చిత్రీకరించిన విజువల్స్ ఆకట్టుకున్నాయి. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తనదైన శైలి వినోదంతో దర్శకుడు హరీష్‌శంకర్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని మేకర్స్ తెలిపారు. జగపతిబాబు, సచిన్ ఖేడేకర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ఆయనంక బోస్, రచన-దర్శకత్వం: హరీష్ శంకర్.

# నాన్న నేర్పించిన దారిలో దీపిక




బాలీవుడ్ నటి దీపికా పదుకొణే గర్భం దాల్చిన దగ్గర నుంచి ఎంతో కేరింగ్ తీసుకుంటుంది. కమిట్ అయిన ప్రాజెక్ట్ లన్నీ పూర్తి చేసిన నేపథ్యంలో ఎలాంటి టెన్షన్ తీసుకోకుండా ఇంట్లోనే గడుపుతుంది. ప్రస్తుతం నెలలు నిండుతోన్న సమయం కూడా. దీంతో ఇంట్లోనే సమయాన్ని గడుపుతుంది. అవసరం మేర భర్తతో కలిసి బయటకు రావడం మినహా మరే కార్యక్రమాలు పెట్టుకోలేదు. తాజాగా ఆమె ఎంతో ప్రశాంతవమైన వాతవావరణంలో సమయాన్ని గడుపుతున్నట్లు తెలుస్తోంది.ఆకాశం, పువ్వులు , సముద్రం వంటి అందమైన బొమ్మల్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ తానెంత ప్రశాంతంగా ఉందన్నది చెబుతుంది. ప్రకృతిలో ఒడిలో ఆరుబయట సమయం గడపడం, విశ్రాంతి తీసుకోవడం, అవసరం మేర చిన్నపాటి ఎక్సరసైజ్ లు చేయడం వంటివి పనిగా పెట్టుకుంది. తాజాగా ఆ మూవ్ మెంట్స్ ని ఉద్దేశించి ఓ ఇంట్రెస్టింగ్ పోస్ట్ చేసింది. %-%నేను కొంత సమయం పాటు పూర్తి భిన్నమైన లోకంలోకి వెళ్లిపోతున్నాను. రెగ్యులర్ స్పాట్ కి భిన్నంగా అదెంతో అహ్లాదాన్ని పంచుతుంది. మనసు ప్రశాంతంగా ఉంటుంది. మైండ్ లోకి ఎలాంటి చెడు ఆలోచనలు రానివ్వను. పూర్తి గా నాకు కావాల్సినంత స్వేచ్ఛ తీసుకుంటాను. ఇది నాన్న నాకు నేర్పించారు. ఇప్పుడు ఆయన పద్దతినే నేను ఫాలో అవుతున్నాను. నిజంగా మనసంతా ఉల్లాసంగా ఉంది. ఫ్రెష్ మైండ్ తో పనులు చేసుకుంటున్నాను%-% అని తెలిపింది. మొత్తానికి దీపిక పాపాయికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటుంది. నెలలు నిండే సమయంలో ఈ సమయం ఎంతో కీలకమైనది. ఒత్తిడికి గురి కాకూడదు. ఆందోళన చెందకూడదు. రెగ్యులర్ గా డాక్టర్ చెకప్ లకు హాజరవుతుంది. అతి త్వరలో రణవీర్ -దీపిక ఇంట బుల్లి పాపాయి అడుగు పెడుతుంది.

# 7కోట్ల రూపాయల కొత్త కారుతో రామ్ చరణ్..




'ఆర్ఆర్ఆర్' మూవీతో పాన్ ఇండియా స్టార్ గా ఎదిగిన రామ్ చరణ్ కు ఉత్తరాదిన కూడా పెద్ద ఎత్తున అభిమానులు ఉన్నారు. చరణ్ తాజా చిత్రం 'గేమ్ ఛేంజర్' కోసం ఆయన ఫ్యాన్స్ ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. సుకుమార్, బుచ్చిబాబు సినిమాలు కూడా లైన్ లో ఉన్నాయి. మరోవైపు ఇప్పటికే రామ్ చరణ్ వద్ద ఎన్నో ఖరీదైన కార్లు ఉన్నాయి. తాజాగా ఈ ఖాతాలో మరో ఖరీదైన కారు చేరింది. రోల్స్ రాయిస్ లేటెస్ట్ వెర్షన్ స్పెక్ట్రా కారును చరణ్ కొన్నారు. దీని ధర ఏకంగా రూ. 7.5 కోట్లు అని సమాచారం. తాజాగా ముంబైలో జరుగుతున్న ప్రముఖ వ్యాపారవేత్త ముఖేశ్ అంబానీ కొడుకు అనంత్ అంబానీ వేడుకలకు వెళ్లడానికి శంషాబాద్ ఎయిర్ పోర్టుకు ఈ కారులోనే చరణ్ వెళ్లారు. తన భార్య ఉపాసన, కూతులు క్లీంకారలతో కలిసి ఆయన ముంబై వెళ్లారు. ఎయిర్ పోర్టుకు కారును చరణ్ స్వయంగా డ్రైవ్ చేసుకుంటూ వచ్చారు. మరోవైపు హైదరాబాద్ సిటీలో ఈ కారు ఫస్ట్ కస్టమర్ చరణ్ కావడం గమనార్హం.

# ధనుష్ 'రాయన్' పెద్దలకు మాత్రమే




తమిళ అగ్రనటుడు ధనుష్, రీసెంట్ సినిమా కథల ఎంపిక ప్రతీ ఒక్కరిని ఆశ్చర్య పరుస్తోంది. నేటివిటికి దగ్గరగా ఉండి, తన పాత్రకు ప్రాధాన్యత ఉంటేనే సినిమాలు ఒకే చేస్తున్నాడు. అసురున్, వాడా చెన్నయ్, కెప్టెన్ మిల్లర్, కర్ణన్ ఆ కోవలో వచ్చినవే. వేటికవే భిన్నమైన కథ, సహజత్వమైన కథనం ఉండే చిత్రాలు. ఇలా విభిన్నమైన సినిమాలతో వరుస హిట్లు కొడుతున్నాడు ధనుష్.కెరీర్‌లో 50వ సినిమా చేస్తున్నాడు ధనుష్. ఈ హీరో నటిస్తూ స్వయంగా దర్శకత్వం వహించింన చిత్రం రాయన్. ఇటీవల విడుదలైన ఫస్ట్‌లుక్ గ్లిమ్స్ కు మంచి ఆదరణ లభించింది. ఈ సారి మరో న్యూ కాన్సెప్ట్ తో వస్తున్నట్టు తెలుస్తోంది. ఈ చిత్రం నుండి వచ్చిన మొదటి సింగిల్ సినిమాపై హైప్ మరింత పెంచింది. ప్రస్తుతం షూటింగ్ కంప్లీట్ చేసుకుని విడుదలకు రెడీగా ఉన్నాడు రాయన్.తాజాగా ఈ చిత్రం సెన్సార్ కార్యకమాలు కంప్లిట్ చేసుకొంది. చిన్న చిన్న కట్స్ తో 'ఎ' సర్టిఫికెట్ జారీ చేసింది సెన్సార్ టీమ్. రక్తపాతం, హింస పాళ్లు కొద్దిగా ఎక్కువగా ఉండడంతో 'ఎ' జారీ చేశారు. 18 ఏళ్ల లోపు వయసుగలవారికి రాయన్ చూసేందుకు అనుమతి లేదు. ఈనెల 26న పాన్ ఇండియా భాషలలో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది రాయన్.